కలర్ నీ ఫేవరెట్ కదా?''

''అవుననుకో కాని... మొన్న కట్టుకున్నావ్ చూడు. నల్లముక్కల తెల్ల చీర... నీకు చాలా బాగుంది చాందీ. ఆ రోజు ఫంక్షన్‌లో కలిశాం కదా? వూరికే దూరం నుంచి చూట్టమే సరిపోయింది.''

''ప్చ్! పాపం.'' జాలిపడింది.

''కాదా?''

''అవునుగాని... ఇప్పుడు మాత్రం హోటల్‌కి వద్దు. నీతో ఇలా కార్లో తిరుగుతున్నా నన్నమాటే గాని....ఓ పక్క నా గుండె గుబ గుబమంటూనే వుంటుంది పరిచయస్తులు ఎవరైనా కనిపిస్తారేమోనని.'' దిగులుగా. గుండెల మీద చెయ్యి పెట్టుకుంది.

ఆ చేతిని సుతారంగా అందుకున్నాడు.

''చాందీ! కాస్సేపు ఆ పిరికితనాన్ని పక్కకి పెట్టి జీవితాన్ని ఆనందంగా ఎంజాయ్ చెయ్యటం నేర్చుకో.''

ఎలా?''

మరునిమిషం తూలి అతని ఒళ్ళో పడిం ది. మెరుపులా ఆమే చేతిని ఒక్క గుంజు గుంజి వళ్ళో పడేలా చేసుకుని పెదాల మీద ముద్దు పెట్టు కున్నాడు.

''ఇలా....''

''యూ....చీటీ...''

''కాదు. నాటీ అను.''

''ఊ... ఇలాగే పబ్లిక్ రొమాన్స్ చెయ్యి. పోలీసులు పట్టుకు పోతారు.'' బెదిరిం చింది.

''పచ్చనోటు చూపిస్తా.''

''గర్వం డబ్బుందని.''

''అంతేకదా. మనిషికి వున్నది బలం. ఎద్దుకి తిన్నది బలం.. సరేగాని చాందీ... తినటం అంటే జ్ఞాపకం వచ్చింది . బాగా ఆకలేస్తోంది.''

విసుగ్గా తల పట్టుకుంది చాందిని.

''మనూ! మళ్ళీ మొదటికి వచ్చావ్. ఇప్పుడు హోటల్సుకి మాత్రం వద్దు. సినిమాకి టైం అయిపోయింది. హాల్లో చిప్సు తిని డ్రింక్ తాగుదాంలే.''

''అంతేనా?''

''అంతే.''

మరు నిమిషం కారు సినిమా హాలు ముందాగింది. సినిమా విడుదల అయిన మొదటి రోజు కావటంతో జనం కిట కిట లాడుతు న్నారు. అప్పటికే హవుస్‌ఫుల్ బోర్డ్ వెలిసింది. చాందినీ చప్పున మనోహర్ పాంట్ జేబులో చెయ్యి పెట్టి పర్సు బయటికి తీసి తన టికెట్ తీసుకుంది.

''ఇదిగో మనూ! నేను ముందెళ్ళి కూర్చుంటాను. నువ్వు మెల్లిగా కారు లాక్ చేసుకుని రా....'' అంటూ చప్పున కారుదిగి మెరుపులా జనంలో కల్సి పోయింది.

మనోహర్ లోపలికి వెళ్ళే సరికి లైట్లు ఆరాయ్. తెరమీద స్లైడ్ పడింది.

''హమ్మయ్య. ఎవ్వరూ చూడలేదు.'' అనుకుంది చందన తేలిగ్గా వూపిరి తీస్తు.

కాని—

తమకాలేజి మేట్ సురేష్ కుమార్ చూశాడన్న విషయం ఆమె గమనించలేదు.

చందనకి ఇంట్లో వాళ్ళకి తెలియకుండా తన లవర్ మనోహర్‌తో చాటు మాటుగా సినిమాలు, షికార్లు ఎంజాయ్ చెయ్యాలంటే తగని భయం. కాని మనోహర్ ఆమెని ఒక పట్టాన ఒదిలి పెట్టడు. మొదట్నుంచి అతను బాగా సరదా మనిషి!

మనోహర్ మెడికో. చందన, సురేష్ సైన్సు కాలేజి స్టూడెంట్సు.

అందమైన చందన అంటే సురేష్ కుమార్‌కి మక్కువ వుండటం సహజమే.

కాని చందనికి మనోహర్ పట్ల వున్న ప్రేమ, మమకారం సురేష్‌పై వెయ్యోవంతు కూడా లేవు సరికదా తగని మంట!

కాగా సురేష్ తాత తండ్రుల కాలం నుంచి రాజకీయ వంశం. ప్రస్తుతం సురేష్ తండ్రి ఎమ్మెల్యే. పలుకుబడికి, డబ్బుకి లోటు లేదు. ఆ దురహంకారంతో కాలేజిలో సురేష్ ఫ్రెండ్సుతో కల్సి చేసే విలని, ఆడపిల్లల్ని అల్లరి పెట్టే విధానం చూస్తుంటే చందన హృదయం తలపు మాత్రానికే భగ్గు మంటుంది. సురేష్ తండ్రి మద్దత్తుతో ఇరవై వేలు ఖర్చుపెట్టి కాలేజి యూనియన్ ప్రెసిడెంటుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. బాగా జల్సారాయుడు. ఫ్రెండ్సు కోసం డబ్బు నీళ్ళలా ఖర్చు పెడతాడు. అందుకే లెక్చరర్సు కూడా సురేష్‌ని గట్టిగా మందలించి పనిష్‌మెంట్ చెయ్యాలంటే వెనుకంజ వేస్తారంటే అతిశయోక్తి కాదు.

(సశేషం)



[illegible] కథ

## మౌన సందేశం

భోజనం చేసి కాసేపలా పడుకుందామని నేను పక్క సరిచేసుకుంటూ ఉంటే కనిపించింది ఆ ఫామిలీ. నేను చేస్తున్న పని ఆపి అటువైపే చూస్తుండి పోయాను. ఎవరో అనగా విన్నాను. ఆ ఫామిలీ చాలా మంచిదని ప్రతివారు వారిని ఆదర్శంగా తీసుకుని నేర్చుకోవలసింది ఎంతైనా ఉందని.

నేను పడుకొని తదేకంగా చూస్తున్నాను. ఎవరైనా అడ్డువస్తే ఏమి అనకుండా వినయంగా పక్కకు తప్పుకొని వెళ్ళా తమ పనేదో తాము చూసుకోవడం నాకు నచ్చింది. ఆ తెలివి తేటలు వినయ విధేయతలు చూసి చాల ముచ్చటపడ్డాను. అందుకే ఆ కుటుంబానికి అంత మంచి పేరు ఉంది అనుకుంటూ మెల్లగా నిద్రలోకి జారిపోయాను.



హఠాత్తుగా మెలకువ వచ్చి టైమ్ చూస్తే నాలుగు గంటలు. అరగంటలో పిల్లలు వచ్చేస్తారు ఉదయం చేసిన స్వీటు ప్లేట్లలో సర్ది టీ పెట్టాలి అనుకుంటూ వంటగది వైపు నడిచాను. నేను స్వీటు ఉంచిన స్థానంలో అది కనిపించలేదు, నేను ముచ్చటపడ్డ ఫామిలీ తింటున్న దృశ్యం కనిపించింది. మొదట ఆ కుటుంబాన్ని చూసి ఎంతో ముచ్చటపడ్డ నాకు యీ దృశ్యం చూసాక చాలా కోపం వచ్చింది. అందుకే అంటారు ఎక్కడివారిని అక్కడే ఉంచాలని! ఏదోలే, కష్టజీవులు కదా అని చూసి ఊరుకుంటే పిల్లలకోసం చేసిన స్వీటంతా తినేస్తున్నారా? ఉండండి మీ పని చెప్తా, ఒక్క దెబ్బలో చస్తారు అనుకుంటూ లోనికెళ్ళి వచ్చి అలాగే ఆగిపోయాను ఆలోచిస్తూ, బుద్ధి, జ్ఞానము వున్న మనుషులే ఎదుటివారిని ఎలా దోచుకుందామా, అక్రమంగా ఎట్లా సంపాదించాలా అని అడ్డదార్లు తొక్కుతున్నారు. మనుషుల బుద్ధులే ఇంత వక్రంగా ఉంటే నోరులేని అల్ప జీవాలు వాటి ఆహారం కోసం రాత్రి పగలు అనే భేదం లేకుండా కష్టించి ఎవరినీ హింసించకుండా సంపాదించుకుంటున్నాయి. అంతకంటే వీటికి మరో మార్గం లేదు. వీటిపైనా నా ప్రతాపం? అనుకుంటూ గోడపై బారుబుగా పోయే చీమల్ని దులపసాగాను మెల్లగా. నా చేతిలో గమాక్సిన్ డబ్బా నన్ను వెక్కిరిస్తూ వుండిపోయింది.

—మల్లినేని హేమలత